క్లుప్తంగా

కోదండరామునికి గరుడ వాహనసేవ



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల దక్షిణవీధిలోని కోదండ రామాలయంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారికి గరుడ వాహనసేవ వేడుకగా నిర్వహించారు. ఆలయంలో సీతారాముల మూలవిరాట్‌లకు విశేష పూజలు నిర్వహించి అనంతరం ఉత్సవాన్ని ప్రారంభించారు. కోదండరామ స్వామి ఉత్సవమూర్తిని మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: చేజర్లలోని కోదండ రామాలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తలంబ్రాలను భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి చుండి రామలింగారెడ్డి, లక్ష్మీసునీత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

పోలీసు కవాతు




మర్రిపాడు: మండలంలోని నందవరం గ్రామంలో ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామస్తులంతా ప్రశాంత వాతావరణంలో ఉండాలని ఎస్సై సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల వరకే పార్టీలని, అనంతరం అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై భాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో మేలు

మర్రిపాడు: పొగాకు రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులైన జనుములు, పిల్లిపెసర, జీలగలు తప్పకుండా తమ పొలాల్లో సాగు చేసి భూమిలో కలియ దున్నాలని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు ప్రతి సంవత్సరం పొగాకు పంటను ఒకే పొలంలో వేయడం వల్ల భూసారం తగ్గి పొగాకు పంట ఉత్పత్తి, నాణ్యతకు నష్టం కలుగుతుందన్నారు. ప్రతి పొగాకు రైతు ఒక ఎకరం పొలంలో 16–20 కిలోల పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేస్తే తద్వారా 20–25 టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఉత్పత్తి అయి భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతుభరోసా కేంద్రంలో సంప్రదించి 50 శాతం సబ్సిడీతో పొందాలని సూచించారు.

కనకదుర్గమ్మకు పొంగళ్లు



అమ్మవారికి పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో ఉన్న శ్రీకనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని పాలపొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పుల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కేసీ నారాయణ, ఎంఎస్ రెడ్డి, పి.వెంగయ్య, డాక్టర్ కృష్ణారెడ్డి, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

ఉపాధి హామీ పథకంతో ప్రయోజనం

- పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం
- మూడేళ్లపాటు సాగు ఖర్చుల అందజేత
- ఐదెకరాలలోపు పొలం కలిగిన రైతులు అర్హులు



సీతారామపురం మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన మామిడి మొక్కలు

సీతారామపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నూరు శాతం సబ్సిడీతో ఉద్యానతోటలు సాగు చేసేలా రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మండలంలో 200 ఎకరాల్లో ఉద్యాన తోటలు పెంచాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయి సిబ్బంది అర్హులైన రైతులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఐదెకరాలలోపు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులంతా ఈ పథకానికి అర్హులు. మామిడి, జామ, దానిమ్మ, సపోట, కొబ్బరి, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్ తదితర పంటలు సాగు చేయవచ్చు. రైతులు వేయదలచుకున్న ఉద్యాన పంటల మొక్కలను ఉపాధి హామీ పథకం అధికారులే అందిస్తారు. అలాగే రైతులే స్వయంగా మొక్కలు కొనుగోలు చేసుకుంటే ఆ బిల్లులను అధికారులకు అందిస్తే వాటిని పరిశీలించి లబ్ధిదారుల అకౌంట్లలో నగదు జమ చేస్తారు. ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహక బాధ్యతలను ఉపాధి హామీ ఏపీఓ, ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పజెప్పడంతో వారంతా ఆసక్తి గల రైతులను గుర్తిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

మూడేళ్ల వరకు సాగు ఖర్చులు

పండ్లతోటల పెంపకానికి ఎంపికై న రైతులు దుక్కులు మొదలు మొక్కలకు గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి వాటికి ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. ఎకరానికి 70 మొక్కల చొప్పున అధికారులు అందిస్తారు. వాటిని మూడు అడుగుల లోతు గుంతలు తవ్వి నాటుకోవాలి. కలుపు తీయడం, ఎరువులు, పురుగుమందుల ఖర్చులు, రవాణా చార్జీలు, నీటి వినియోగ ఖర్చులు కూడా ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతు బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తుంది. అలాగే మూడేళ్ల వరకు రైతుల సాగు ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. పంటను బట్టి రైతులకు రూ.లక్ష పైగానే ప్రభుత్వం నుంచి అందుతుంది. మెట్టప్రాంత రైతులు ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇప్పటికే సీతారామపురం మండలంలోని బాలాయపల్లి, రంగనాయుడుపల్లి, దేవిశెట్టిపల్లి, అయ్యావారిపల్లి, బసినేనిపల్లి, మారంరెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి తదితర గ్రామాల్లోని పలువురు రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించారు.



ఉపాధి నిధులతో వేసిన జామ మొక్కలు

ప్రభుత్వ ఖర్చుతోనే సాగు



ఉపాధి హామీ పథకం ద్వారా నూరు శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. చిన్న, సన్నకారు రైతులు దీనిని వినియోగించుకోవాలి. సీతారామపురం మండలంలో ఇప్పటివరకు 23 ఎకరాలకు ప్రతిపాదనలు పంపాం. పెట్టుబడి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. ఆసక్తి గల రైతులు సచివాలయాల్లోని వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, ఉపాధి హామీ పథకం అధికారులను సంప్రదించి ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

– సుభాషిణి, ఉపాధిహామీ పథకం ఏపీఓ, సీతారామపురం

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అనుమసముద్రంపేట: త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

దుత్తలూరు: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నందిపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత గ్రంథాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మలను వివరించారు. కార్యక్రమంలో సభ్యులు కె.వెంకటేశ్వర్లు, జి.పెంచలరత్నం, కె.నరసింహులు, ఎం.నాగమ్మ, డి.రమణయ్య పాల్గొన్నారు.

ఏఎస్‌పేట మండలంలో..

అనుమసముద్రంపేట: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక పాదలకూరు కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పొనుగోడు, తాతిరెడ్డిపల్లి, రాజవోలు, పైడిపాడు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెంచలయ్య, సభ్యులు కార్తీక్, పెంచలస్వామి, విశ్రాంత ఉపాధ్యాయుడు మురగళ్ల సుధాకరాచారి, అభినయ, కొండయ్య శేషాద్రి, పద్మమ్మ, నరసారెడ్డి, భాగ్యమ్మ, గాయత్రి, కిషోర్, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.



దుత్తలూరు: నందిపాడులో ప్రచారం నిర్వహిస్తూ..

రామాలయంలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియ శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో సీతారాముల ఉత్సవాలు జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు 16 రోజుల పండగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు సీతారాములను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం ద్వారా వరికుంటపాడు మండలంలోని గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు చేయనున్నట్లు మండల వైద్యాధికారిణి కరిష్మా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులను తీసుకొచ్చి వైద్యపరీక్షలు చేయించాలని తెలిపారు. అవసరమైన మందులు కూడా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

కొమ్మిలో సీతారాముల ఉత్సవాలు ప్రారంభం

కొండాపురం: మండలంలోని కొమ్మి గ్రామంలో సీతారామస్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం సీతారాములకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

లోక్ అదాలత్‌పై అవగాహన అవసరం

కలిగిరి: సత్వర న్యాయం అందించే లోక్ అదాలత్‌పై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కావలి డివిజన్ లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. ఆదివారం కలిగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోర్టుకు రాని కేసులు, పెండింగ్ కేసులను ఖర్చు, కాలయాపన లేకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కావలి సబ్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కేసులకు రాజీల ద్వారా పరిష్కార మార్గం చూపుతారని తెలిపారు. నిరుపేదలకు ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందజేస్తారని తెలిపారు.

ప్రతిభావంతులకు కంప్యూటర్ల బహూకరణ



ఉత్తమ మార్కులు సాధించి కంప్యూటర్లు అందుకున్న విద్యార్థులు

మర్రిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 550 పైన మార్కులు సాధించిన జిల్లాలోని 600 మందికి పైగా విద్యార్థులకు ప్రోత్సాహకంగా చంద్ర కంప్యూటర్ వరల్డ్ అధినేత చంద్రశేఖర్ తన సొంత నిధులతో కంప్యూటర్లు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 300 మంది విద్యార్థులకు కంప్యూటర్లు అందజేశారు. ఆదివారం మర్రిపాడు మండలంలోని చుంచులూరులో జరిగిన కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు కంప్యూటర్లు బహూకరించారు. ఈ సందర్భంగా చంద్ర కంప్యూటర్స్ అధినేత చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ సంస్థ స్థాపించి 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతిభావంతులను ప్రోత్సహించి వారిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేలా కంప్యూటర్లు అందజేస్తున్నామని తెలిపారు. కంప్యూటర్ అందుకున్న చుంచులూరుకు చెందిన కలిశెట్టి జ్ఞాపిక తండ్రి రాజేంద్రకుమార్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేలా చంద్ర కంప్యూటర్ వరల్డ్ అధినేత చంద్రశేఖర్ అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై సర్వే



ఆత్మకూరులో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారిలో బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపడంతోపాటు వారికి కావాల్సిన పరికరాలను అందించేందుకు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. మే 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఐఈఆర్‌పీలు కాటంగారి పద్మ, ఆళ్ల జయకుమార్ ఆత్మకూరులో ఈ సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, ఆశా కార్యకర్తల సహకారంతో 50 రోజులపాటు ఈ సర్వే నిర్వహించినట్లు వారు తెలిపారు. ఆదివారంతో సర్వే పూర్తయిందని తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు గల వారిలో శారీరక అంగవైకల్యాలను బట్టి ప్రత్యేక అవసరాల పరికరాలను వారికి ఏర్పాటు చేసే క్రమంలో ఈ స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు ఐఈఆర్‌పీఈలు తెలిపారు. సమగ్ర శిక్ష పీడీ ఆదేశాల మేరకు భవిత విద్యా కేంద్రంలో వినికిడి లోపం, దృష్టిలోపం, బుద్ధిమాంద్యం, ఆటిజం, శారీరక అంగవైకల్యం లాంటి 21 రకాల ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి వారి పూర్తి సమాచారం జిల్లా కేంద్రానికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు పట్టణం, మండలంలో 12 మందిని గుర్తించినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలో ఆదివారం ఎస్సై ఆదిలక్ష్మి, పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనపత్రాలతోపాటు వాహనచోదకులకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

దెబ్బతిన్న రోడ్డు మార్జిన్లు



గానుగపెంటపల్లి వద్ద దెబ్బతిన్న రోడ్డు మార్జిన్

ఉదయగిరి: ఉదయగిరి నుంచి గండిపాళెం, నందిపాడు గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మార్జిన్లు వర్షాలకు దెబ్బతినడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మార్జిన్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వాహనాలు వస్తే రోడ్డు మార్జిన్‌లోకి దిగాలంటే వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వర్షాలతో ఉపశమనం



జలదంకి: బ్రాహ్మణక్రాక పొలాల్లో చేరిన వర్షపునీరు

జలదంకి: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జలదంకి మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు. వర్షంతో వాగులు, వంకలు, ప్రధాన రహదారులు, గ్రామాల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. రైతులు పచ్చిరొట్ట, వరి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

ఓ మోస్తరు వర్షం

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొమ్మి, గానుగపెంట, సత్యవోలు, లింగన్నపాళెం గ్రామాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గత రెండు నెలలుగా తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షంతో ఊరట లభించింది. ఆదివారం కూడా పలుచోట్ల వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో మెట్టప్రాంత రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

సర్కారు బడుల్లో చేర్చండి



కరపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్చాలని ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను, నాణ్యమైన విద్యను వివరించారు. మహిమలూరులో ప్రధానోపాధ్యాయుడు ఇస్మాయిల్, వెన్నవాడలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రకుమార్ సహచర ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు.

ఇరువర్గాల ఘర్షణ

సంగం: మండల కేంద్రమైన సంగంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నేతల మధ్య ఆదివారం సాయంత్రం వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణ జరిగింది. సంగం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అనుమాలశెట్టి రామారావు స్థానికంగా ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఫ్యాన్సీ స్టోర్ వద్ద రామారావుతోపాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్త జహంగీర్ మరికొంతమంది కూర్చుని ఉండగా.. అదే సమయంలో అటుగా వెళ్తున్న టీడీపీ నేత రవీంద్రరెడ్డి సోదరుడు మధురెడ్డి, కాలం తిరుపతిరెడ్డి జహంగీర్‌ను దుర్భాషలాడారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి ఈ ఘటనపై సంగం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంగం సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. సంగంలో ఇరువర్గాలు ప్రశాంతంగా ఉండాలని, ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

రోడ్డుపై మట్టిని తొలగించండి



మట్టి తొలగించకపోవడంతో బురదమయంగా మారిన గంగుంట రోడ్డు

సోమశిల: అనంతసాగరంలోని గంగుంట రోడ్డు వద్ద వర్షం కురిస్తే చిన్నపాటి చెరువుగా మారుతోందని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించకపోవడంతోనే ఇలా జరుగుతోందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ రోడ్డుకిరువైపులా ఉండే మట్టిని తొలగించకపోవడంతో వర్షం కురిస్తే బురదమయం మారుతోందని అన్నారు. పాదచారులు బురదలో నడుస్తూ జారి పడి గాయాల పాలవుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టిని తరలించి నీళ్ల వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



వరికుంటపాడు: మండలంలోని జి.కొండారెడ్డిపల్లె నుంచి ఉదయగిరి మండలం వెంగళరావునగర్ వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారిందని, స్తంభాన్ని సరి చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల వరికుంటపాడు మండలంలో ఈదురుగాలులు, వర్షాలు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆత్మకూరు డివిజన్‌లో వర్షపాతం

ఉదయగిరి: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం తదితర మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. ఉదయగిరి మండలంలో 8.4 మి.మీ., సీతారామపురం మండలంలో 31.2 మి.మీ., సంగం మండలంలో 41.4 మి.మీ., అనంతసాగరం మండలంలో 14.6 మి.మీ., ఆత్మకూరు మండలంలో 16.2 మి.మీ., చేజర్ల మండలంలో 28.4 మి.మీ., ఏఎస్‌పేట మండలంలో 10.6 మి.మీ., కలువాయి మండలంలో 8.4 మి.మీ., మర్రిపాడు మండలంలో 11.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. అకాల వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది. ఈ వర్షం రైతులకు ప్రయోజనకరమని పలువురు పేర్కొన్నారు.

దేవాంగులు సంఘటితంగా ఉండాలి

మనుబోలు : సమస్యల పరిష్కారం కోసం దేవాంగులంతా సంఘటితంగా ఉండి పోరాడాలని జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సజ్జ వెంకట సురేష్ పిలుపునిచ్చారు. జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ ఆలయంలో దేవాంగ సందర్శన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున దేవాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగులంతా ఐకమత్యంగా ఉంటూ తమ కుల వృత్తి అయిన చేనేత పరిశ్రమ అభివృద్ధికి పాటు పడాలన్నారు. తమ పిల్లలను చేనేత వృత్తికి పరిమితం చేయకుండా ఉన్నత చదువులు చదివించి మంచి ఉద్యోగాలు పొందేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న అంతిమయాత్ర పథకం, విద్యా వికాసం, ప్రతిభా పురస్కారాలు తదితర విషయాల గురించి సంఘం ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య వివరించారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు వెంకటసుబ్బయ్య, ఉదయభాస్కర్, వీరాస్వామి, సురేష్ పాల్గొన్నారు.